డా॥ కేతవరపు రాజ్యశ్రీ ముద్రలు

# కరోనా.. టూరిస్టు కాదు

భారత్ భాషా భూషణ్

డా॥ కేతవరపు రాజ్యశ్రీ

# "కరోనా టూరిస్టు కాదు"

# "కరోనా టూరిస్టు కాదు"

డా॥ కేతవరపు రాజ్యశ్రీ

ప్రథమ ముద్రణ : నవంబర్ 2020

వెల : రూ. 101/-

ప్రతులకు :

**డా॥ కె. రాజ్యశ్రీ**

ప్లాట్ నెం. 301, గోకుల్ అపార్ట్‌మెంట్స్,
స్ట్రీట్ నెం. 4, అశోక్ నగర్, హైదరాబాద్ -500 020.
ఫోన్ : 040-2765 0267, సెల్ : 85001 21990
ఇ-మెయిల్ : rketavarapu@gmail.com

website : **www.rajyasri.com**

డి.టి.పి. :

**టి. రాజేంద్రప్రసాద్**

ముద్రణ :

**అక్షయ గ్రాఫిక్స్**

చిక్కడపల్లి, హైదరాబాద్.

సెల్ : **9989890588**

ఇ-మెయిల్ : rajendratammisetty3@gmail.com

# అంకితం

కర్తవ్య నిర్వహణే అయినా
మానవతా దృక్పథం జోడించి
మనసా వాచా కర్మణా
కరోనా కట్టడికి
అహరహం శ్రమించిన
వైద్య, ఆరోగ్య, పోలీసు, పారిశుద్ధ్య
సేవా మూర్తులకు...



– డా॥ కేతవరపు రాజ్యశ్రీ

# కృతజ్ఞతలు

లఘు రూప కవితా వేదిక, రెక్కల రూపశిల్పి శ్రీ సుగమ్‌బాబు గారికి, కవితిలక దాశరథి పురస్కార గ్రహీత డా॥ తిరునగరి గారికి, లఘు రూప కవితా వేదిక తెలంగాణ అధ్యక్షులు శ్రీ నూతక్కి రాఘవేంద్ర గారికి, లఘు రూప కవితా వేదిక ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు భూపతి వర్మగారికి, "నేటి నిజం" బైసా దేవదాసు గారికి, నియోగి గారికి, ఐనంపూడి శ్రీలక్ష్మి, తమిరిశ జానకి, జంధ్యాల కుసుమకుమారి, కె. కామేశ్వరి, నూలు శ్రీరామచంద్రరావు, మా శ్రీవారు మాధవరావుగారు, కుమారుడు కేతవరపు ఫణీంద్ర, కుమార్తె ప్రియాంక ప్రతాప, తమ ఉత్సాహపూరిత సందేశాలతో ప్రోత్సహించిన, ఇతర వాట్సాప్, ఫేస్‌బుక్ మిత్రులకు కృతజ్ఞతలు.

డా॥ కేతవరపు రాజ్యశ్రీ



భారత్ భాషా భూషణ్, కవితిలక
**డా॥ తిరునగరి**
మహాకవి డా॥ దాశరథి అవార్డు గ్రహీత (తెలంగాణ ప్రభుత్వం)
తెలుగు విశ్వవిద్యాలయం 'ప్రతిభా పురస్కార గ్రహీత'
6-17/5, డి-నగర్, చింతల్ (హెచ్.ఎం.ఎఫ్.)
హైదరాబాద్ - 500 054. తెలంగాణ.
సెల్ : **9392465475**

# రాజ్యశ్రీ ఏది రాసినా!

"ప్రపంచాన్ని చూడలేని
కవిత నిజంచూపదు
ఇసుకలో కూరుకున్న
ఉష్ట్రపక్షి బాపతు" అన్నాడు మహాకవి శ్రీశ్రీ..

ప్రపంచాన్ని చూచి స్పందించి కవిత్వం వ్రాసే కవులు, కవయిత్రులు, సమాజంలోని ప్రజల నాలుకపై జీవించి వుంటారు. ఈనాడూ-ఏనాడూ ఎరగని విలయాన్ని సృష్టించి ప్రపంచాన్ని వణికిస్తున్న భయంకరమైన మహమ్మారి "కరోనా". ప్రపంచ జన జీవనాన్ని అస్తవ్యస్తం చేసిన కరోనా, ప్రపంచ దేశాలన్నిటినీ, గడగడలాడించింది.

కరోనా ప్రారంభమైన నాటి నుండి ఇప్పటి దాకా, దాని పూర్వాపరాలను, నిశితంగా పరిశీలించిన, ప్రసిద్ధ కవయిత్రి డా॥ కేతవరపు రాజ్యశ్రీగారు, తెలుగు రాష్ట్రాలలోనూ కరోనా మహమ్మారి సృష్టించిన, భయోత్పాతాన్ని కళ్లార చూశారు. తాను నివసిస్తున్న సమాజానికి, తన కవిత్వం ద్వారా, సందేశమివ్వాలనుకున్నారు. ఆమె చీకటిని తిడుతూ కూర్చునే కవయిత్రి కాదు. చిన్ని దీపాన్ని వెలిగిస్తేనే చీకటి పోతుంది అన్నది ఆమె సిద్ధాంతం. ఫలితంగా, వెలువడిన కావ్యం "కరోనా టూరిస్టు కాదు".

వస్తు నవ్యత, శబ్ద రమ్యత, కలగలసిన కవిత్వం డా॥ రాజ్యశ్రీగారిది.

“ఊహాన్‌లో పుట్టి
ఊహకందని విధంగా
వడివడిగా సుడిగాలిలా
ప్రపంచాన్ని ఉక్కిరి బిక్కిరి
చేసింది “కరోనా”
గబ్బిలాల్ని తిని
ప్రపంచ దేశాలను
గబ్బు పట్టించింది”
అన్నారు.

❖ ❖ ❖

బాలలూ, వృద్ధులనే కనికరం లేదు
శవాల గుట్టలపై
కరాళ నృత్యం చేసింది “కరోనా”

❖ ❖ ❖

ప్రపంచం
చిన్న జీవికి
దాసోహమన్న
వైనాన్ని, చాలా దయనీయంగా వర్ణించారు కవయిత్రి.

❖ ❖ ❖

“ఇప్పుడు
యుద్ధం

శత్రువుతో కాదు" అంటారు.

శత్రుమిత్ర దేశాలన్నీ
కలిసి యుద్ధం
రణ భూమిలో కాదు
కరోనా నిర్మూలన క్షేత్రంలో

కాలం తెచ్చిన మార్పు-

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, వలస కార్మికులు, డాక్టర్లు, పోలీసులు, పారిశుద్ధ కార్మికులు ఎన్నెన్నో దృశ్యాలను రాజ్యశ్రీగారు హృదయ ద్రావకంగా కవిత్వీకరించారు.

"కంటికి కనిపించిందంతా, కైతగా రాసేస్తున్నాను" అన్నారు దాశరథి. తన కంటికి కనిపించిన ప్రతి దృశ్యాన్నీ కవిత్వంగా రచించారు రాజ్యశ్రీ.

"కవితా మయమేనోయ్ అన్నీ" అంటూ

"మల్లె
నెత్తిన
పెట్టుకొని పోతానా?

అవసరానికి దాచుకున్న ధనం
అనాథ రోగులకి దానం
వృద్ధురాలి దాతృత్వం
తలదించుకున్న స్వార్థం"

తలదించుకున్న స్వార్థం ఎంత "వ్యంగ్యం"! వక్రోక్తి కవిత్వానికి అలంకారం కదా!

"మేటి దేశాలన్నీ
కరోనా జపం
భారత్ మాత్రం
ఆయురారోగ్యాల కోసం
మృత్యుంజయ జపం"

భారతీయ ఆధ్యాత్మికతను పరిమళింపచేసిన పంక్తులు-
"బడి లేదు
గుడి లేదు
సినిమాలు లేవు
షికార్లు లేవు
కడుపే కైలాసం
వంటిల్లే వైకుంఠం
కరోనా
నీకిది తగునా!" అని ప్రశ్నిస్తారు.

కరోనా పుణ్యమా అంటూ బంధుత్వాలు దూరమైనాయి. ఆత్మీయులను దూరం చేసింది.

"కరోనా రోగులపై / నెగెటివ్ దృక్పథం / సరి కాదంటూ" "మానవత్వాన్ని కాదు" మహమ్మారిని పారద్రోలు" అని సందేశించారు. "మానవత్వానికి మరో పేరు కవిత్వం అన్నారు" విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్.

పిల్లల్లో పెరిగిన
మానసిక సమస్యలు
కోపం, విసుగు, చిరాకు
పాఠశాలలకు దూరం
కరోనా కంటే
ప్రమాదకరం"

కరోనా నేపథ్యంలో, లాక్‌డౌన్ కారణంగా ఈనాడు ఇంటింటా వున్న సమస్య ఇది.

ఇందులో ఉపాధి కోల్పోయిన చిరుద్యోగులు, ఆన్‌లైన్ చదువుల అవస్థలు, ఆకాశాన్నంటుతున్న ధరలూ, కరోనా వికృత, విషాద పరిణామాలనూ, ప్రజల దైన్య జీవనాన్నీ రాజ్యశ్రీగారు హృదయ ద్రావకంగా వర్ణించారు. ఇలా చెబుతూ పోతే ఎన్నెన్నో!

కరోనా రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు కూడ రాజ్యశ్రీ లేఖిని కవితాత్మకం చేసింది.

ఈ కావ్యం చదివితే "కరోనా" పూర్తి సమగ్ర సమాచారం తెలుస్తుంది.

వర్తమానంలో సమాజాన్ని సందేశించే మంచి కావ్యం "కరోనా టూరిస్టు కాదు", కావ్యం పేరులోనే "కరోనాను" ఆషామాషీగా తీసుకోవద్దన్న హెచ్చరిక వుండటం గమనించవలసిన విషయం.

ప్రఖ్యాత కవి "రెక్కలు-రూపశిల్పి" శ్రీ సుగమ్‌బాబుగారి సూచన మేరకు డా. రాజ్యశ్రీ ఈ కావ్యం రాసానని చెప్పారు.

శ్రీ సుగమ్‌బాబుగారు ప్రతిభను వెన్ను తట్టి ప్రోత్సహించే విశాల హృదయులు. గతంలో వారి ప్రోత్సాహంతోనే డా॥ రాజ్యశ్రీగారు భగవద్గీతను, "గీతామృతం" అనే పేరుతో రెక్కల ప్రక్రియలో రాశారు.

ఆ కృతి ఆమెకు మంచి పేరు తెచ్చింది.

రాజ్యశ్రీ ఏది రాసినా దానిలో కవిత్వం వుంటుంది. వస్తు నవ్యత, అభివ్యక్తి నవ్యత కవిత్వానికి అవసరమని తెలిసిన ఈ కవయిత్రి కలం నుండి వెలువడిన కావ్యం ''కరోనా టూరిస్టు కాదు''. కావ్య రచయిత్రిని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను!

కేతవరపు రాజ్యశ్రీ
చేతం కవితా చేతం
చేత కలం పట్టిందా
గీతాలే గీతాలు
ఆమె ఎడద నిండా కరుణ
ఆమె పలుకులందు తేనె
ఆమె శబ్దమందు ఒక్క
అందమైన ఒక చందం
సంస్కారం ఆమె గుణం
సౌజన్యం ఆమె ధనం
కేతవరపు రాజ్యశ్రీ
ఖ్యాతి గన్న వాణిశ్రీ

"ముసలి మోహం పడిన వృక్షం మీద
యౌవనం చిగురించడం కవిత్వం
రోజూ పొందని ఆనందానుభూతి
పొందడం అంటేనే కవిత్వం
మనసు మల్లె పొదల్లోంచి
పసందైన వాసనలు వీచి
అవి పదాల సీసాల్లోకి
అనంతకాలం నిలిస్తే కవిత్వం"
అన్న మహాకవి దాశరథిగా
కవితా వాక్యాలతో
స్వస్తి...

డా॥ తిరునగరి

**1-10-2020**

# నా మాట

కరోనా సృష్టించిన కల్లోలం, భయాందోళనలు, కాలు బయట పెట్టలేక (ఇంట్లోనే వుండలేక) అందరిలోనూ నెలకొన్న ఒక అయోమయం, మానసిక అస్తిమిత పరిస్థితి.

రెక్కల రూపశిల్పి, శ్రీ సుగమ్‌బాబుగారు ఫేస్‌బుక్‌లో లఘురూప కవితా వేదిక గ్రూప్‌ని ప్రారంభించి, ఎంతో మంది కొత్త కవులను, పాత కవులను లఘు రూప కవిత్వం వైపు ప్రోత్సహించారు.

దాని తరువాత కరోనా ఉపద్రవం వచ్చి పడింది. లాక్‌డౌన్ సమయాన్ని వృధాగా గడపడం కన్నా, కవిత్వం ద్వారా కరోనా గురించి మన భావాలు, భయాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు, సలహాలు, సందేశాలతో కవిత్వం రాయాలని అనిపించి, సుగమ్‌బాబుగారితో చెప్పగానే, వారు చాలా సంతోషించి మొదలు పెట్టమని ప్రోత్సహించి, ఈ కవితలను ఫేస్‌బుక్‌లోని లఘు కవితా వేదికలో పోస్టు చేయండి. ఏ రోజుకారోజు పాఠకులు స్పందన తెలుస్తుందని చెప్పారు. అలాగే రోజుకొక కవిత, ఆ రోజు వార్తా పత్రికలో పడిన సమాచారం మేరకు, స్వీయ అనుభవాలు కలిపి కరోనా మొదలు నుంచి రాయడం జరిగింది. వాటిని ఫేస్‌బుక్‌లో చదివిన మిత్రులు, శ్రేయోభిలాషుల ప్రోత్సాహం ఈ పుస్తకానికి ప్రేరణనిచ్చింది.

చైనా నుండి కరోనా టూరిస్టుగా రాలేదు. దానితో కలిసి కొంతకాలం బతకాలి. వ్యాక్సిన్ రావడానికి కొంత సమయం పడుతుంది అని అవగాహన కలిగి, చివరకి, వాక్సిన్ వచ్చే వరకూ, మన ముందున్న ఆప్షన్ 'ఇమ్యూనిటీ' పెంచుకోవడమే అని తెలుసుకున్నాము.

అలా ఇమ్యూనిటీ పెంచుకుని, కరోనాను తరిమి కొట్టడమే మన ప్రస్తుత కర్తవ్యం అంటూ ఈ కవిత్వం ముగింపుకొస్తుంది.

అలా 'కరోనా టూరిస్టు కాదు' అనే నా కవిత్వం ఆఖరికి రాగానే, దాన్ని పుస్తక రూపంలో వేద్దాం, చాలా బాగా వచ్చినాయి కవితలన్నీ అంటూ తమ అమూల్యమైన సందేశాలు పంపి, ప్రోత్సహించిన సుగమ్‌బాబుగారి కోరిక మేరకు పుస్తకం ప్రచురించడమైంది.

ఇంతకు ముందు కూడా, వారి ప్రోత్సాహంతోనే "రెక్కల్లో గీతామృతం", "వెన్నెల పక్షులు", "అక్షరం అస్తిత్వమైన వేళ", "వెన్నెల మెట్లు" కవితా పుస్తకాలు ప్రచురించాను.

ఇక ఈ పుస్తకానికి ముందు మాట "రాజ్యశ్రీ ఏది రాసినా!" అంటూ నా కవిత్వం మీద తమ అమూల్య అభిప్రాయాలు తెలిపిన కవితిలక "తిరునగరి"గారు నాకు గురుతుల్యులు.

"తిరునగరి
కవితాఝరి
అలుపెరగని
అక్షరగిరి"

అని నా "అక్షర కేతనం" కవిత సంకలనంలో వారి మీద ఓ చిరు కవిత రాశాను.

నిజంగానే వారి కలానికి అలసట తెలియదు. నిరంతర కవితా ప్రవాహం జాలువారుతూ వుంటుంది వారి నుంచి.

**2019**లో వంశీ సంస్థవారు "తిరునగరి" గారిని 'దాశరథి' అవార్డుతో సత్కరించారు. ఆ సభలో నేను ఆత్మీయ అతిథిగా పాల్గొని వారి గురించి మాట్లాడటం చాలా సంతోషం కలిగించింది.

నేను కవిత్వం రాయడానికి, బద్ధకించకుండా ప్రతి 15 రోజులకొకసారి 'తిరునగరి' గారి దగ్గర నుంచి ఒక పోస్ట్ కార్డు వస్తుంది. దానిలో కొత్తగా మీరు ఏమి రాస్తున్నారు? మీ కలాన్ని ఆపడం, హృదయాన్ని కదిలించే మంచి కవితలు రాస్తారు మీరు. కొనసాగించండి. మీ శ్రీవారు మాధవరావు గారిని అడిగాను చెప్పండి. చిరంజీవులకు ఆశీస్సులు అంటూ రాస్తారు.

ఇటువంటి అలవాటు మా నాన్నగారు కీ.శే. మహాకాళి వేంకటరావుగారికి వుండేది. ప్రతి పండుగకూ బంధుమిత్రుల యోగక్షేమాలు, పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ పోస్టుకార్డు రాసేవారు.

తరువాత 'తిరునగరి'గారు ఆ లోటు భర్తీ చేశారు. వారి పలకరింపులో ఎంతో ఆత్మీయత, ప్రతి కవినీ, కవిత్వాన్నీ మెచ్చుకునే గొప్ప మనస్తత్వం వారిది.

శ్రీ త్యాగరాయగానసభలో "రాజ్యశ్రీ కవిత్వం – విశ్లేషణ" అనే విషయం మీద సభలో, తిరునగరి గారు, నా కవిత్వం గురించి విశ్లేషించిన తీరు. నేనెన్నటికీ మరచిపోలేని, మధుర జ్ఞాపకం.

ఈ సంవత్సరం తెలంగాణ ప్రభుత్వం వారిని 'దాశరథి' పురస్కారంతో సత్కరించడం కవిత లోకానికి, ముఖ్యంగా నాకు ఎంతో గర్వకారణం.

వారికి భగవంతుడు ఆయురారోగ్యాలను ప్రసాదించి, మరింత కవిత్వంతో మా మనసులను రంజింప చేయాలని కోరుకుంటున్నాను.

❖ ❖ ❖

# కరోనా టూరిస్టు కాదు

కన్ను
నలుపు కోవాలంటే భయం
ముక్కు
గోక్కోవాలంటే భయం
గొంతు
తడారితే భయం ..
తుమ్మాలన్నా, దగ్గాలన్నా
"కరోనా" అని భయం-

❖ ❖ ❖

ఊహన్‌లో పుట్టిన
సూక్ష్మక్రిమి
ఊహకందని విధంగా..
వడివడిగా..
సుడిగాలిలా..
ప్రపంచాన్ని
ఉక్కిరి బిక్కిరి-

చైనా
గబ్బిలాలు తిని
ప్రపంచ దేశాలకు
గబ్బు పట్టించింది
మూగజీవుల శాపం..
కరోనా కర్కసి
రూపం-

❖ ❖ ❖

బాలలూ,
వృద్ధులనే
కనికరం లేదు
శవాల గుట్టలపై
కరాళ నృత్యం-

అతి సూక్ష్మ శత్రువుపై
యుద్ధానికి..
అణుబాంబులు కావు–
శుచీ శుభ్రతలు..
నమస్కార సంస్కారం..
సాంఘిక దూరం–
చాదస్తపు ఆచారాలే..
పదునైన ఆయుధాలు–

❖ ❖ ❖

ప్రపంచం..
ఓ చిన్న జీవికి
దాసోహం–
విజ్ఞానం..
దాని ముందు..
చేతులు కట్టుకుని..

ఇప్పుడు..
యుద్ధం..
శత్రువులతో కాదు–
నన్ను..
నేను
స్పృశించకుండా–

❖ ❖ ❖

మారిన జీవన శైలి–
రాత్రీ పగలూ..
తేడా తెలియని
సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు
టి.వి.కి
అంకితమై..
రోజుకి
మూడు సినిమాలు–

శతృమిత్ర దేశాలన్నీ
కలిసి
యుద్ధం–
రణ భూమిలో కాదు!
ఇంటి గడప
దాటకుండా!

❖ ❖ ❖

"ముల్లె"
నెత్తిన పెట్టుకుని పోతానా?
అవసరానికి
దాచుకున్న ధనం..
అనాథ రోగులకి దానం–
వృద్ధురాలి దాతృత్వం..
తలదించుకున్న స్వార్థం–

నిన్నటి దాకా..
అతడెవరో
నేడు
అతడో వి.ఐ.పి.
మెడలో రూపాయల దండ..
తలపై పూలవర్షం
అతడే..
కరోనా నుంచి కాపాడే..
పారిశుద్ధ కార్మికుడు-

❖ ❖ ❖

కుటుంబాలకు దూరం
రోడ్ల మీద భోజనం
కరోనాను లెక్కచేయని కర్తవ్యం
ఒకచేత లాఠీలతో కాఠిన్యం
మరోచేత అనాధలపై కారుణ్యం
ప్రజాసేవకు అంకితం..
పోలీసుల జీవనం-

వుక్కపోత వేసవి కాలం..
అయినా ..
నిలువెల్లా..
కరోనా రక్షణ కవచం
కఠోర కర్తవ్య దీక్షతో
అలుపెరుగని వైద్యం
తమ ప్రాణాలను పణం-
వైద్యో నారాయణో హరిః

❖ ❖ ❖

చంకలో బిడ్డ ..
వీపున మూట..
నడినెత్తిన ఎండ..
పొట్ట చేత పట్టుకొని
మైళ్ళ కొద్దీ నడక-
లాక్ డౌన్ లో..
వలస కూలీల గోడు-
చేరాలి సొంత గూడు-

"లాక్ డౌన్" తో
పిల్లలకి
ఇల్లే పాఠశాల-
నాన్నకు..
ఇల్లే కార్యశాల-
అమ్మకు ..
వంటిల్లే చెరసాల-

❖ ❖ ❖

కరోనా మహమ్మారి
విజృంభించగానే..
వేలుకి వేలు తగలేయించిన
చిన్నాచితకా రోగాలన్నీ
భయభక్తులతో
అణిగి మణిగి..

మేటి దేశాలన్నీ
"కరోనా" జపం
"భారత్" మాత్రం
సర్వజనుల
ఆయురారోగ్యాల కోసం..
మృత్యుంజయ
"జపం"-

❖ ❖ ❖

శాస్త్ర విజ్ఞానంలో దిట్టలు..
అభివృద్ధి చెందిన దేశాల
వైద్య ఆరోగ్య వ్యవస్థ
డొల్లతనం..
కరోనాతో..
తేటతెల్లం-

"లాక్‌డౌన్‌తో
ఇంటి వంటకే ఓటు–
పండ్లూ ఫలాలకి చోటు
ఎంగిలి తిండ్లు చేటు..
పిజ్జా బర్గర్లపై వేటు–

❖ ❖ ❖

పక్కవాడు బాగుంటే
ఈర్ష్య
నిన్నటి మాట–
వాడు బాగుంటేనే
మనం బాగు–
నేటి మాట
మనిషి దృక్పథంలో
మంచి మార్పు–

“లాక్ డౌన్” నిశ్శబ్దంలో
నా గది కిటికీ నుంచి
వేప చెట్టు కొమ్మల
చిరుసవ్వడులు
పక్షుల స్వేచ్ఛాగానం
ఇప్పుడు
స్పష్టంగా..
వీనుల విందుగా..

❖ ❖ ❖

నన్ను నేను కోల్పోయి
చాలా రోజులయింది–
‘లాక్‌డౌన్’లో..
ఇప్పుడు
నాతో నేను
సహజీవనం
చేస్తున్నాను–

బంధువులను
దరిచేరనివ్వని 'కరోనా'–
సహరోగులే
ఆత్మీయులుగా..
బాధ, భయం పంచుకుంటూ
ఆసుపత్రిలో
ఆటపాటలతో
కాలక్షేపం–

❖ ❖ ❖

సామాజిక మాధ్యమాల్లో..
నకిలీ వీడియోలు–
మెదళ్లు కుళ్లిన
పైశాచికుల
ఆగడాలు
"కరోనా"ను మించిన
భయభ్రాంతులు–

ఎందరి
ప్రాణాలో కాపాడిన
ప్రఖ్యాత వైద్యుడు..
కరోనా కాటుకు
బలి–
ఖబ్రస్తాన్‌లో..
ఖననానికి..
వెలి–

❖ ❖ ❖

ఇంట్లోనే..
ఉండి ఉండీ..
మనుషులు–
మనిషి జాడ లేని
వీధుల్లో..
కుక్కలూ
పిచ్చి పట్టినట్టు–

వలస కూలీలకు
ఆహారం, మాస్కులూ
పంపిణీ..
సరే..
వాటితోపాటు
శానిటరీ నాప్కిన్స్ కూడా..
(స్త్రీ మూర్తుల వాస్తవ అభ్యర్ధన)

❖ ❖ ❖

ఇప్పుడు
సమాజానికి
అత్యంత ఆప్తులు..
పారిశుద్ధ్య కార్మికులూ..
రోడ్లు వూడ్చే వాళ్లూ..
పని వాళ్లూ–
"కరోనా"తో
కనువిప్పు–

మండు వేసవిలో..
చల్లటి నీళ్ళు నిషిద్ధం-
వేడినీళ్ళ సేవనం-
ఏ.సి. గాలి నిషిద్ధం..
ఉక్కపోత జీవనం..
కరోనా జర హటోనా!-

❖ ❖ ❖

బడి లేదు, గుడి లేదు
సినిమా లేదు
షికారు లేదు-
కడుపే కైలాసం..
వంటిల్లే వైకుంఠం
కరోనా నీకిది తగునా!-

ప్రకృతి కొత్తగా
ముస్తాబవుతోంది–
శుచీ శుభ్రతల
కవచంతో..
కాలుష్యరహితంగా–

❖ ❖ ❖

సోమవారం ఉదయం
విసుగ్గా
అబ్బా! బడికి వెళ్లాలా?
అబ్బా! ఆఫీసుకి వెళ్లాలా?
'లాక్‌డౌన్'తో..
అన్నీ ఆదివారాలే!
హాయిగా ఇంట్లో వుండమంటే
అబ్బా! బోర్!

భారతీయ
ఆయుర్వేద వైద్యం-
కరోనా పాలిట
అంకుశం!
ఇప్పుడు
ప్రపంచానికి
తేటతెల్లం-

❖ ❖ ❖

ప్రభాత నడక
తప్పనిసరి
డాక్టర్ ఆదేశం-
బయటకొస్తే..
తడాఖా చూపిస్తా..
కరోనా హుంకారం-
ఎటూ తప్పని
మరణ భయం-

కూరలు లేనిదే..
ఇల్లు గడవదు–
కొన్నది మొదలు
కరోనా వాహకాలనే–
భయాందోళనలు
ఇల్లాలి ఇక్కట్లు
ఇన్నిన్ని కాదయా!

❖ ❖ ❖

వైద్యకొరతతో
"ఇటలీ" దేశం
వృద్ధులను
చావుకు వదిలేసింది–
ఇతర దేశాలదీ అదే బాట–
రేపటి తరానికి
అనుభవ సంపద ఇచ్చిన
ప్రాణాలకు విలువ లేదా?

మండుటెండల్లో..
రోజు కూలీల పడిగాపులు
ఒకపక్క ..
మందుబాబుల పడిగాపులు
మరోపక్క
ఒకడు "భుక్తి " కోసం-
మరొకడు "కిక్కు" కోసం-

❖ ❖ ❖

కుటుంబ సభ్యుల నుంచి
కరోనా సోకకుండా
వృద్ధులకు
ఇంట్లోనే
ప్రత్యేక వసతి
"రివర్స్ క్వారెంటైన్"

అంటరానితనం
సామాజిక నేరం..
నిన్న-
అస్పృశ్యతే..
ఆత్మ రక్షణకు
ఆయుధం..
నేడు-

❖ ❖ ❖

క్రీస్తు పూర్వం
"క్రీస్తు శకం"లాగా
కరోనాకి ముందు ..
కరోనా తరువాత-
కాలగణనలో ..
సరికొత్త
మార్పు?

రెడ్, ఆరెంజ్, గ్రీన్ రంగులు
"ట్రాఫిక్ సిగ్నల్స్" మాత్రమే..
కావు–
'కరోనా' తీవ్రత
సూచించే..
జిల్లాలు, జోన్లు..
కూడా–

❖ ❖ ❖

కరోనాతో..
మళ్లీ..
ఆనాటి
వస్తు మార్పిడి విధానం–
క్యాష్‌లెస్..
కార్డ్‌లెస్..

మనిషికి
తన కుటుంబం..
కొండంత బలం–
కరోనా సోకగానే..
ఆ
కుటుంబమే..
దూరం–

❖ ❖ ❖

ఆలయాల్లో
దర్శనం నిలిపివేత–
భక్తులకు
భగవంతుడు దూరం–
మానసిక, ప్రశాంతత
మృగ్యం–

నిన్నటి దాకా
అరణ్యమే..
వన్యప్రాణుల
ప్రపంచం–
లక్‌డౌన్‌'తో
నగర వీధుల్లో
స్వేచ్ఛా విహారం–

❖ ❖ ❖

"గ్రేట్ వాల్ ఆఫ్ చైనా" మీద
దిగిన ఫోటో
నిన్నటి దాకా
ఓ గొప్ప జ్ఞాపకం
నేడు
ఎవరికి చూపాలన్నా
భయం–

పరిస్థితులు
తారు మారు–
సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు..
నేడు
ఉపాధి హామీ కూలీలు–
"లాక్ డౌన్" నేర్పించింది
"డిగ్నిటీ ఆఫ్ లేబర్"–

❖ ❖ ❖

'ట్రెండ్' మార్చిన కరోనా!
సినిమా విడుదల
థియేటర్లో కాదు–
"అమెజాన్" లో–
ఇప్పుడు బుల్లితెరే..
వెండితెర–
ఇల్లే..
సినిమా హాల్–

లాక్ డౌన్‌లో ..
వినూత్న ఆలోచన–
పెళ్లి విందు
ఇవ్వలేని పరిస్థితి–
ఇంటింటికి వెళ్లి
వంట సరుకుల
అందజేత–

❖ ❖ ❖

తల్లికి
కరోనా పాజిటివ్
పురిటి బిడ్డ క్షేమం–
పసిగుడ్డుకు
తల్లి పాలు దూరం–
అమ్మను కూడా
దూరం చేయకు
ప్లీజ్–

నానా పాట్లు పడి
సొంత వూళ్లకి పయనం
రైలు దిగారో లేదో..
మళ్లీ ఎదురు చూపులు–
భవన నిర్మాణ రంగానికి..
మూలస్తంభాలు
వలస కూలీలు–

❖ ❖ ❖

'కరోనా' మృతుల
దహనానికి
స్థానికుల
అభ్యంతరాలు–
ప్రత్యేక
శ్మశానవాటిక ఏర్పాటు దిశగా
ప్రభుత్వ యంత్రాంగం–

డబ్బూ, దస్కం, హెూదా..
'కరోనా' ముందు
చేతులు
కట్టుకొని–

❖ ❖ ❖

భయం భయం
సమస్త మానవాళి..
భయం గుప్పిట్లో..
"కరోనా"
ఖేల్ ఖతం కరోనా–

జీవనం
ఖరీదైనది కాదు
మన
జీవనశైలి –
"లాక్‌డౌన్"తో
కలిగింది
కనువిప్పు –

❖ ❖ ❖

అంతుపట్టని
కరోనా "నాడి"
రోజుకో కొత్త వ్యూహంతో
దాడి –
అప్రమత్తతే
మన ముందున్న
దారి –

**130** కోట్ల జనాభాలో
నువ్వొ ఒకడివి..
ప్రభుత్వానికి–
నువ్వే సర్వస్వం
నీ కుటుంబానికి–
శిరోధార్యం..
"కరోనా" గీసిన
లక్ష్మణ రేఖలు–

❖ ❖ ❖

మండే ఎండ నుంచి..
ఉపశమనం
వర్ష ఋతువు
ఆగమనం–
పక్కనే పొంచి వున్న
కరోనా వుధృతి
భయం–

కరోనాతో..

ఆగిన రాకపోకలు-

బాంధవ్యాల

ఎదురు చూపులు-

వీడియో కాల్స్

ఓదార్పులు-

❖ ❖ ❖

ప్రాణాయామంతో

శ్వాసకోశ

పదిలం-

'యోగా'తో..

సాధ్యం-

కరోనాపై..

విజయం-

పరీక్షలు లేవు–
వారూ వీరని..
తేడాలు లేవు–
అందరూ పాస్..
పదో క్లాస్–

❖ ❖ ❖

భయం కూడా..
అవసరమే–
అప్రమత్తత
నేర్పిస్తుంది–
కరోనా
చేసింది అదే!

గల్ఫ్ దేశం నుంచి
స్వదేశానికి పయనం–
"క్వారంటైన్" లోనే మరణం–
కడచూపు నోచని సంతానం–
కరుణలేని కరోనా
మరణ మృదంగం!

❖ ❖ ❖

డాక్టర్ అవాలని
అతడి కోరిక–
కన్నతల్లి మందుల కోసం
'కరోనా' శవాల తరలింపు–
ప్రాణాపాయమైనా..
తప్పని
బ్రతుకు పోరాటం–

"లాక్‌డౌన్"లో
కుదిరిన
మూడు ముళ్ల
ముహూర్తాలు..
కాబోయే వధూవరులు
క్షణాలు
లెక్కించుకుంటూ–

❖ ❖ ❖

ఫోన్ సంభాషణల్లో
"కరోనా" గురించే..
మరో వూసు లేదు–
భయాలూ–
జాగ్రత్తలూ–
కూరగాయలు
కడుక్కోవడాలూ–

పాజిటివ్
రోగుల పట్ల ..
నెగటివ్ దృక్పథం?
పారదోలు
మహమ్మారిని–
మానవత్వాన్ని..
కాదు–

❖ ❖ ❖

అపార్టుమెంట్
పై అంతస్తుల నుంచి..
కిందకి
తాళ్లు కట్టిన బుట్టలు–
పాలు, పండ్లు, కూరలు
పైకి చేరవేసే
రవాణా సాధనాలు–

కరోనాతో..

నీటివాడకం..

విద్యుచ్ఛక్తి వాడకం..

ఆక్సిజన్ వాడకం..

పెరుగుదల–

మనిషి

ఆయురారోగ్యాలు

తరుగుదల–

❖ ❖ ❖

హంతకులనే కాదు–

ఇప్పుడు

శునకాలు

కరోనా రోగుల

గుర్తింపు కూడా–

ఇక వైద్యం

సులభతరం–

సామూహిక దహనాలు..
కాలీకాలని
మృతదేహాలు-
తమ వారెవరో..
ఏ చితిపై కాలుతున్నారో..
తెలియని
దుర్భర పరిస్థితి-

❖ ❖ ❖

'లాక్‌డౌన్' సంక్షోభంలో
పరస్పర సహకారానికి
పునాది..
"టైమ్ బ్యాంక్"
డబ్బు దాచుకున్నట్టే..
సాయం చేసిన
పనిగంటలు
ఖాతలో జమ-

ఇంట్లో..

కుటుంబ సభ్యులతో హాయిగా

అయినా..

ఏదో తెలియని స్తబ్ధత–

స్వేచ్ఛ కోసం ఆరాటం

స్నేహితుల మధ్య

పురివిప్పే మనసు..

గుండె లోతుల్లో బందీ–

❖ ❖ ❖

విమాన ఛార్జీలు,

బోర్డింగ్, లాడ్జింగ్

ఖర్చులు లేని

'ఆన్‌లైన్' సమావేశం–

ఢిల్లీలో..

ప్రధానమంత్రి

రాష్ట్రాల్లో..

ముఖ్యమంత్రులు–

కరోనా పాజిటివ్
వస్తుందేమోనని
ఫలితం రాకముందే..
ఆత్మహత్య-
భయం గుప్పిట్లో
అల్లాడుతున్న
జనం-

❖ ❖ ❖

కలికాలంలో
అంతంత మాత్రం
అనుబంధాలు-
పులిమీద పుట్రలా..
కరోనాతో
మానవత్వం కూడా
మటుమాయం-

ఆటలు లేవు-
చదువులో పోటీ లేదు
పిల్లల్లో పెరిగిన
మానసిక సమస్యలు-
కోపం-విసుగు-చిరాకు
పాఠశాలలకు దూరం..
కరోనా కంటే..
ప్రమాదకరం-

❖ ❖ ❖

జీవనం
ఖరీదైనది కాదు..
కాని
జీవనశైలి-
'లాక్‌డౌన్'తో
కలిగిన
కనువిప్పు-

మహమ్మారిని..

జయించారు-

కుటుంబీకుల మనసు

గెలవలేకపోయారు-

ఆసుపత్రి బయట

వృద్ధుల

పడిగాపులు-

❖ ❖ ❖

'కరోనా' రోగులతో

కలిసిమెలిసి పార్టీలు-

వైరస్ సోకిన

మొదటి వ్యక్తికి

"నజరానాలు"

అమెరికా "అలబామా"లో

అమానుష క్రీడలు-

ఇస్తినమ్మ మాస్కూ..
పుచ్చుకొంటినమ్మ మాస్కు-
కరోనా కట్టడికి..
మహిళల
మాస్కుల వాయనాలు-
శ్రావణ మాస నోముల్లో
సామాజిక స్పృహ-

❖ ❖ ❖

'ఎమ్మెల్యే'కి కరోనా-
అసెంబ్లీ హాలు మూత
చరిత్రలో తొలిసారిగా
వేపచెట్టు కింద
"పుదుచ్చేరి"
శాసనసభా సమావేశాలు-

పలకా బలపం..
మొన్నటి మాట-
పెన్నూ, పుస్తకం..
నిన్నటి మాట-
అందరికీ అందని..
ఆన్‌లైన్ చదువు..
నేటి మాట-

❖ ❖ ❖

దేవాలయాల్లో..
కరోనా నియంత్రణ
"మిషన్ అర్చక" యంత్ర
ఆవిష్కరణ-
చేయి చాపితే..
తీర్థం-

మృతదేహాల ప్యాకింగ్ ..
కెమికల్స్‌తో ముఖాలు శుభ్రం ..
శవాల మధ్యే భోజనం – నిద్ర
బతుకు తెరువు కోసం
కరోనా మార్చురీ సిబ్బంది
దైన్యం–

❖ ❖ ❖

'కరోనా'ను
గెలిచారు–
మరొకరికి
ప్రాణదాతలయ్యారు–
బాధితుల పాలిట
దేవుళ్లు
ప్లాస్మాదాతలు–

ప్రసూతి ఆస్పత్రుల్లో..
కరోనా ఎఫెక్ట్–
డాక్టర్ల కొరత–
నిండు గర్భిణుల..
పడిగాపులు–
మధురమైన
మాతృత్వం
బేలగా.. బెంగగా..

❖ ❖ ❖

'డి' విటమిన్ లోపం..
'కరోనా'కి
ఆహ్వానం–
మన ప్రాచీన
సూర్యనమస్కారాలే..
పరిష్కార మార్గం–

ఆపురావురుమంటూ
ప్రైవేట్ ఆసుపత్రులు-
భౌతిక దూరానికీ..
డబ్బు వసూలు-
కొత్త కొత్త పేర్లతో
రోగుల నుంచి
అధిక ఛార్జీలు-

❖ ❖ ❖

కష్టకాలంలో..
వ్యాపార చిట్కా-
కరోనా మాస్కు..
ఫ్యాషన్‌గా మార్పు-
"బ్రాండెడ్"
"డిజైనర్"
"మ్యాచింగ్"-

ఒకప్పుడు
మాస్కులూ..
గ్లౌజులూ..
డాక్టర్ల చిహ్నాలు–
ఇప్పుడు
అందరికీ
నిత్యావసర
సరుకులు–

❖ ❖ ❖

వైరస్ కాదు–
గ్రామస్తుల వెలివేత
ఒక నిండు ప్రాణం..
ఆత్మహత్యకు బలి–
మానవత్వం
మరిపిస్తున్న
కరోనా–

దంపతుల మధ్య
పెరిగిన అన్యోన్యత-
కలిసి మెలిసి
ఇంటి పనులు-
సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలతో..
అలసిన అనుబంధాలు
"వర్క్ ఫ్రమ్ హోమ్"తో
మళ్లీ చిగురింత-

❖ ❖ ❖

'కరోనా' కాటుకి
ఉద్యోగాల కోత-
జీతం తక్కువైనా
ప్రభుత్వ ఉద్యోగాల వేట-
భద్రతకు
పెద్దపీట-

నిన్నటి దాకా
ప్రభుత్వ నియంత్రణ-
'లాక్‌డౌన్'
సడలింపుతో..
అసలు సిసలు
పరీక్ష..
"స్వీయ నియంత్రణ"-

❖ ❖ ❖

లాక్‌డౌన్ సడలింపు-
సొంత కట్టింగ్ కిట్లతో
బిక్కుబిక్కుమంటూ..
క్షౌరశాలలకు-
గడ్డాలకూ..
మీసాలకూ..
మోక్షం-

కళకళలాడే

ఆలయ ప్రాంగణాలు

వెలవెల

భగవంతుడి దర్శనం లేక

భక్తులు విలవిల

నోములూ, వ్రతాలు లేక

గుడి ఆదాయం కలకల

కరోనా! ఇంకెంత కాలం

నీ రెపరెప?

❖ ❖ ❖

ప్రకృతిని

నియంత్రించాలన్న

మనిషి

అహంకారం

'కరోనా'తో

పటాపంచాలు–

చైనా నుంచి
టూరిస్టుగా
రాలేదు..
కరోనా
కలిసి జీవించాలి
కొంతకాలం-

❖ ❖ ❖

విదేశీ విద్యపై
మోజు తగ్గిన యువత
స్వదేశీ విద్యపై మమత..
భారత్‌లోనే భవిత-
ఇది
'కరోనా' ఘనత-

పారాసెటిమాల్, అజిత్రోమైసిన్ ..
విటమిన్ బీ, సీ, డీ, గోలీలు..
ఆక్సిమీటర్, థర్మామీటర్, గ్లూకోమీటర్-
ఆవిరి యంత్రం, బి.పి. యంత్రం..
మాస్కులూ, గ్లౌజులూ, శానిటైజర్లూ..
ఇప్పుడు
ప్రతి ఇల్లూ
ఓ చిన్న సైజ్ క్లినిక్-

❖ ❖ ❖

"లాక్‌డౌన్"లూ, క్వారెంటైన్లు..
మందులూ, మాకులూ..
ఆయుధాలన్నీ ఖతం-
ఇక
ఆఖరి అస్త్రం
కరోనాను ఓడించే..
"బ్రహ్మాస్త్రం"..
"ఇమ్యూనిటీ"



# రచయిత్రి పరిచయం

**డా॥ కేతవరపు రాజ్యశ్రీ,** ఎం.కామ్.

**వృత్తి** : ప్రభుత్వ ఉపకార్యదర్శి (పూర్వ)
రచయిత్రి, కవయిత్రి,

**ప్రవృత్తి** : రచనా వ్యాసంగం, సామాజిక సేవ.

**వివిధ ఆధునిక ప్రక్రియలలో ముద్రిత రచనలు – 35**

**సంకలన ప్రచురణలు – 5**

**ఆధ్యాత్మిక రచనలు** : 1. నీలోకి నువ్వు, 2. ఆధ్యాత్మిక వ్యాస సంపుటి 4. ఆధ్యాత్మికత వృద్ధులకేనా 3. రెక్కలో గీతామృతం

**విదేశీ యాత్రా విశేషాల గ్రంథాలు** : 1. నా లండన్ యాత్ర, 2. సింగపూర్, మలేషియామరియు శ్రీలంక యాత్ర

**ఇంగ్లీషులో** : 1. స్ప్రింగ్ ఆఫ్ థాట్స్, 2. గీతామృత్

**హిందీలో** : 1. అక్షర్ కేతన్, 2. గీతామృత్

**కన్నడలో** : గరిగళు గీతామృత్

**లలిత గీతాలు** : సి.డి. ఆవిష్కరణ (యూ ట్యూబ్‌లో లభ్యం)

వెబ్‌సైట్ : **www.rajyasree.com**

**(ప్రముఖుల పరిచయాలు, అందుకున్న బిరుదులు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, పురస్కారాలు, చిత్రమాలికల సంపూర్ణంగా 23 పుస్తకాలు సమాహారం)**

**విదేశాలలో** : 1. తానా సభలు – అమెరికా (డల్లాస్, యు.ఎస్.ఏ.), 2. లండన్ నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలు, 3. సాహిత్య భారతి – న్యూజెర్సీ, 4. 5వ ప్రపంచ తెలుగు సదస్సు – సింగపూర్, 5. మలేషియా తెలుగు సంఘం వారి సత్కారం, 6. ఉత్తర అమెరికా తెలుగు సంఘం (డల్లాస్, యు.ఎస్.ఏ)

**అధ్యక్షులు** : కేతవరపు ఫౌండేషన్, హైదరాబాద్

**గౌరవాధ్యక్షులు** : చేతన సచివాలయ సారస్వత వేదిక, హైదరాబాద్

**బిరుదులు** : 1. డాక్టరేట్, 2. భారత్ భాషా భూషణ్, 3. ప్రజ్ఞాశ్రీ, 4. సాహిత్యశ్రీ, 5. వేదాంత వక్త, 6. స్త్రీ శక్తి, 7. సేవా రత్న

**జీవన సాఫల్య పురస్కారాలు** : 1. యునైటెడ్ థియోలాజికల్ రీసర్చ్ యూనివర్సిటీ, 2. సృజన సాహితీ సంస్థ, సత్తుపల్లి,

**పురస్కారాలు** : 1. డా॥ అక్కినేని స్వర్ణపతక పురస్కారం, 2. శ్రీశ్రీ యక్స్‌లెన్సీ అవార్డు, 3. ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ పురస్కారం, 4. టంగుటూరి ప్రకాశం పంతులు అవార్డు, 5. మదర్ థెరిస్సా పురస్కారం.